

జనహృదయనేతకు
స్వాగతం - సుస్వాగతం
ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల చిరకాల స్వప్నం అయిన
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
శంకుస్థాపనకు విచ్చేయుచున్న గౌ॥ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి
స్వాగతం - సుస్వాగతం
Site For BHOGAPURAM INTERNATIONAL AIRPORT
కడుబండి శ్రీనివాసరావు
శాసనసభ్యులు, శృంగవరపుకోట




స్వాగతం - సుస్వాగతం
అంతర్జాతీయ స్థాయిలో మా ప్రాంతానికి తలమానికం కాబోతున్న
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపనకు
విచ్చేయుచున్న ఆంధ్రప్రదేశ్ జనహృదయనేత
ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు
గౌ॥శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి
స్వాగతం - సుస్వాగతం
కాకర్లపూడి శ్రీనివాసరాజు
వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు
భోగాపురం, నెల్లిమర్ల నియోజకవర్గం, విజయనగరం జిల్లా

## క్లుప్తంగా

### దారి పొడవునా జగనన్న పచ్చతోరణం



రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు

భోగాపురం: భోగాపురంలో నిర్మాణం కానున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మండలానికి రానున్నారు. ఈ నేపథ్యంలో డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ఆదేశాల మేరకు సీఎం హెలిపాడ్ నుంచి శంకుస్థాపన, బహిరంగ సభ జరిగే స్థలం వరకు జగనన్న పచ్చతోరణంలో భాగంగా ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు రోడ్డుకు ఇరువైపులా సుమారు 300పైగా మొక్కలు నాటారు. సభా ప్రాంగణం వరకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ అదిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### 5న ద్విచక్ర వాహనాల వేలం

నెల్లిమర్ల: నెల్లిమర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) స్టేషన్లో మూడు ద్విచక్ర వాహనాలను ఈ నెల 5న వేలం వేస్తామని ఆ స్టేషన్ సీఐ జీఎస్.రాజశేఖరనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోండా యాక్టివా, హీరో ప్యాషన్, టీవీఎస్ మోపెడ్ వాహనాలను ఉదయం 10 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని సీఐ సూచించారు.

### ఉద్యోగ మేళాకు స్పందన

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 100 మందికి నిరుద్యోగ యువత పాల్గొనగా వారికి రాత పరీక్ష నిర్వహించారు. అనంతరం వారికి పలు ఫార్మా, ఇతర కంపెనీల్లో ఉపాధి అవకాశాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, ప్లేస్‌మెంట్ అధికారి రమణమూర్తి, పలు సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### మెగా వైద్య శిబిరం సక్సెస్



మెగా వైద్య శిబిరంలో రోగులు సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

విజయనగరం: స్థానిక శాంతినగర్ 20వ డివిజన్‌లో మత్స్యకారుల సంఘం సొసైటీ కార్యాలయంలో ఇండో హ్యూమన్ రైట్స్ కేర్(భారత మానవ హక్కుల సంరక్షణ) ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా 20వ డివిజన్ కార్పొరేటర్ కంటుబుక్త తవిటిరాజు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కె.సంతోష్ రాజు, డాక్టర్ బి.వెంకట్ రమణ వైద్య పరీక్షలు చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో బీపీ, షుగర్, పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసుకున్నారు. నేషనల్ మీడియా సెక్రెటరీ టి.రవికుమార్, నేషనల్ ఆర్టీఐ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ టి.హరిబాబు, జి.రాజశేఖర్ ఇండో హ్యూమన్ రైట్స్ సంస్థ తరఫున ముఖ్య బాధ్యత వహించారు. శిబిరంలో ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు, ఇండో నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డోలా శంకరరావు రోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నేషనల్ సెక్రటరీ ట్రస్టీ ఆర్.ఇషిత, నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఏఎస్ రాజు, నేషనల్ కోశాధికారి, ఆర్.విజయ, నేషనల్ యూత్ ప్రెసిడెంట్ ఎం.సుగుణ కుమార్, నేషనల్ జాయింట్ కోశాధికారి కె.వరలక్ష్మి, నేషనల్ జాయింట్ సెక్రటరీ ఆర్.రుషిత, ఉమన్ ప్రెసిడెంట్, విశాఖపట్నం పి హేమలత, నేషనల్ వెల్ఫేర్ సెక్రెటరీ ఆర్ లక్ష్మణరావు, ఆర్టీఐ ప్రొటెక్షన్ ఫోర్స్ జి రమేష్, జిల్లా ప్రెసిడెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అసిరితల్లికి పూజలు



పూసపాటిరేగలో ఘటాలు ఊరేగిస్తున్న పూజారితో పాటు గ్రామస్తులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పూసపాటిరేగలో ఆసిరితల్లి అమ్మవారు పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. అసిరితల్లి, బంగారమ్మ, దేశమ్మ, చంద్రమ్మ, పోలిపిల్లి, పైడితల్లి, కంచమ్మ అమ్మవార్లుకు పూసపాటిరేగ గ్రామస్తులు పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. గ్రామంలో ఘటాలతో పూజారి ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

# మీరు చేసినవి బూటకపు శంకుస్థాపనలు

- గత శంకుస్థాపనలో అశోక్‌గజపతిరాజు ఎందుకు పాల్గొనలేదు?
- బంగ్లాలో కూర్చుని అర్థం లేని ప్రకటనలు చేయటం సరికాదు
- మీరు చూస్తున్న పత్రికలు నిజాలు రాయవన్న సంగతి తెలుసుకోండి
- వాస్తవాలు కావాలంటే సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోండి
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శంకుస్థాపనలు చేసి ప్రజలను మభ్యపెట్టడం అలవాటని, అలాంటి బూటకపు కార్యక్రమాలు తాము చేయలేమని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు తమ ప్రభుత్వ హయాంలో అన్ని అనుమతులు తీసుకుని ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని, భూమి పూజ చేసిన మరుసటి రోజు నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఇందుకు సంబంధించి జీఎంఆర్ సంస్థ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, వాస్తవాలు తెలుసుకోవాలంటే సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ శంకుస్థాపనపై మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తెలుసుకోకుండా అశోక్‌గజపతిరాజు బంగ్లాలో కూర్చుని అర్థం లేని ప్రకటనలు చేయటం సరికాదన్నారు. ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఒక్క అనుమతి లేకుండానే చంద్రబాబు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం అశోక్‌గజపతిరాజుకు తెలియదా అంటూ ప్రశ్నించారు. ఆ కార్యక్రమానికి జిల్లా ఎంపీగా ఉంటూ ఎందుకు హాజరుకాలేదో ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. శంకుస్థాపన అనంతరం నిర్ణీత 36 నెలల్లో జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అశోక్‌గజపతిరాజు వ్యాఖ్యలు చూసి సొంత పార్టీ నాయకులే జాలి పడుతున్నారన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం గతంలో ఉన్న నిబంధనల మేరకే జరుగుతుందని, ఎటువంటి మార్పులు, చేర్పులు చేయలేదని స్పష్టం చేశారు. మీరు చూస్తున్న పత్రికలు నిజాలు రాయవన్న సంగతిని తెలుసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఖరారైనప్పటి నుంచి ప్రతిపక్ష నేతల్లో భయం పట్టుకుందని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసినా 2019 ఎన్నికల్లో 151 సీట్లు కట్టబెట్టిన ప్రజలే, 2024 ఎన్నికల్లో 175 సీట్లు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అదే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు.

# పేదల పక్షపాతి సీఎం జగన్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సంక్షేమ సారథిగా, పేదల పక్షపాతిగా ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని 21వ డివిజన్‌లో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి, ప్రజల యొక్క స్పందన ఎలా ఉంది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. బింగి వీధి, కుప్పిలి వీధి తదితర ప్రాంతాలలో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలపై కూడా ఆరా తీశారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి మాట్లాడుతూ తమ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో పూర్తయిందన్నారు. ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో వేయడంతో లంచగొండితనం, అవినీతి లేకుండా పూర్తి పారదర్శకంగా సాగుతుందన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. 20వ డివిజన్ కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు అందించడమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించిన నాడే నాయకుడిగా ప్రజల హృదయాలలో నిలుస్తారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతిపక్షాలు రకరకాల వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తారని, వాటిని నమ్మి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జి కాళ్ల సూరిబాబు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కరరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి కనకల గిరి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనతో ఉత్తరాంధ్ర అభివృద్ధి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు

- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో పెద్ద ఎత్తున ఉద్యోగాలు
- రామతీర్థ సాగర్‌తో సాగు, తాగునీటి సరఫరా
- ఫ్లోటింగ్ జెట్టీతో 20 వేల మంది మత్స్యకారులకు లబ్ధి
- ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో ఉత్తరాంధ్రలో అభివృద్ధి పరుగులు తీస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు(సురేష్‌బాబు) ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని మొయిద విజయరాంపురంలోని ఆయన స్వగృహంలో ఆయన విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. భోగాపురంలో నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు సీఎం జగన్‌మోహన్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేస్తారన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ఉత్తరాంధ్రకు చెందిన వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎయిర్‌పోర్ట్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన సీఎం నిర్మాణానికి సంబంధించిన అన్ని అవాంతరాలను అధిగమించారని చెప్పారు. నిర్మాణానికి అవసరమైన సుమారు 2700 ఎకరాలను సేకరించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేవలం శిలాఫలకం వేసి, వదిలేశారని ఎమ్మెల్సీ ఎద్దేవా చేశారు. ఆ పార్టీ ఎంపీ అశోక్ గజపతిరాజు ఏవియేషన్ మంత్రిగా ఉండి కూడా ఒక్క అడుగు కూడా పనులు ముందుకు సాగలేదని ఆరోపించారు.

**బహుళ ప్రయోజన ప్రాజెక్టుగా రామతీర్థ సాగర్**

నెల్లిమర్ల నియోజకవర్గంలోని 24,710 ఎకరాలకు సాగునీటితో పాటు విజయనగరం పట్టణానికి తాగునీటిని అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులకు సంబంధించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు. పెండింగ్ పనులకు ప్రభుత్వం ఇప్పటికే రూ 194.4 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్సీ తెలిపారు. పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద నిర్మించే ఫ్లోటింగ్ జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్సీ చెప్పారు. దీని నిర్మాణంతో భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన సుమారు 20వేల మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

**డేటా సెంటర్‌తో ఉపాధి అవకాశాలు**

ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి విశాఖపట్నంలో ఏర్పాటుచేసే ఆదాన్ డేటా సెంటర్‌కు బుధవారం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్సీ చెప్పారు. సదరు సెంటరుతో 18 వేల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగానూ, మరో 54 వేల మందికి పరోక్షంగానూ ఉపాధి లభిస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ధవళ లక్ష్మణరావు, అట్టాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పాదాలమ్మ ఉత్సవాలు



పాదలమ్మ తల్లిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన పాదాలమ్మను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దర్శించుకున్నారు. పాదాలమ్మ వార్షిక మహోత్సవాలలో భాగంగా ఆలయ నిర్వాహకులు, స్థానికులు అమ్మవారిని మంగళవారం కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని గద్దెకు తెచ్చి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందరావు, వజ్రపు శ్రీనువాసురావు మాట్లాడుతూ ఎంతో సత్యవంతమైన తల్లిగా పాదాలమ్మ పూల్ బాగ్ ప్రాంతంలో వెలసిందని అన్నారు. 38 సంవత్సరాలుగా ప్రతి ఏటా పాదాలమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వేముల రాంప్రసాద్, జీకే శ్రీను, మిర్తిపాటి అప్పన్న, సిద్ధాబత్తుల జగదీశ్వరరావు, మొండి నారాయణ, కొవ్వూరు సన్యాసిరావు, మెండా రమణ పాల్గొన్నారు.

# బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభం



బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం, కోచ్‌లు

తెర్లాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో మండలంలోని నెమలాం హైస్కూల్‌లో ప్రారంభించిన ఉచిత వేసవి బాల్ బ్యాడ్మింటన్ శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల గ్రామ సర్పంచ్ మజ్జి నరసింహులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం దాలినాయుడు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 31వరకు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని పాఠశాల పీడీ, శిక్షణా శిబిరం కోచ్ జి.సింహాచలం ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులంతా ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనాలని కోరారు. బాల్ బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం కోచ్ సింహాచలం మాట్లాడుతూ ప్రతీరోజు బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 3.30గంటల నుంచి 6గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: పాఠశాలలు, కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, యాజమాన్యం బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన, మంచి మార్కులు సాధించలేక పోయిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం దురదృష్టకరమని చెప్పారు. పిల్లలతో తల్లిదండ్రులు అన్ని విషయాలు చర్చించి వారితో ఎక్కువ సేపు గడపాలని సూచించారు. చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దాడితల్లి సిరిమానోత్సవం

- పోటెత్తిన భక్తజనం
- దర్శించుకున్న ప్రముఖులు



సిరిమాను నుంచి ఆశీర్వచనాలు ఇస్తున్న పూజారి

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ముహూర్త సమయానికి సిరిమాను రథం జై దాడితల్లి, జైజై దాడితల్లి అన్న భక్తుల నినాదాల మధ్య కదిలింది. గొల్లపల్లితో పాటు 12 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవంగా భావించే భక్తులు తమ మొక్కులు తీర్చుకుని దాడితల్లికి ప్రణమిల్లారు. గొల్లపల్లి పైల వీధిలో పూజారి బత్తిన సూరిబాబు సిరిమానును అధిరోహించారు. సిరిమానోత్సవానికి ఉత్తరాంధ్ర, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. పైల వీధిలో సిరిమాను ప్రారంభమై భక్తుల జయజయధ్వానాల మధ్య కీడురాయి వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి దాడితల్లి కాలనీలో ఊరేగింది. అక్కడి నుంచి ప్రధానరహదారి మీదుగా పట్టణంలోకి ప్రవేశించింది.

**ఆకట్టుకున్న బల్ల వేషాలు:**

సంప్రదాయ బల్ల వేషాల అంకం గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి జాతరలో నేటికీ కొనసాగుతోంది. అందులోని కొత్త ఒరవడిని కలగలిపి బల్ల వేషాలు పండుగకు ఏటా కొత్త రూపు తీసుకువచ్చి భక్తులకు కనువిందు చేస్తున్నాయి. వీటితో పాటు విచిత్ర వేషధారణలు, కాళీమాతల ప్రదర్శనలు అలరించాయి. ఈ సారి కొత్తగా భారీ కాయంతో ఉన్న శివ రూపుడి ప్రదర్శన ఆకట్టుకుంది.

**తృటిలో తప్పిన ముప్పు**

సిరిమానోత్సవ రథాన్ని పైల వీధిలో తిప్పి వెనక్కి మళ్లించినపుడు విద్యుత్ స్తంభానికి చిన్నగా రాసుకుంటూ కాసేపు ఆగింది. అంతకు ముందు కాసేపు మొరాయించింది. అనంతరం జై దాడితల్లి అంటూ భక్తుల నినాదాలతో సిరిమాను ముందుకు కదిలిపోయింది.

**ప్రముఖుల దర్శనం**

దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం నాడు ఏటా దర్శించుకునే ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సోదరుడు శంబంగి వేణుగోపాల నాయుడితో కలిసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి సిరిమాను వద్ద పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు సిరిమాను వద్ద, ఆలయంలోనూ దాడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి ఆర్‌వీఎస్‌కే రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్‌వీఎస్‌కేకే రంగారావులు సిరిమానోత్సవానికి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు, తహసీల్దార్ రాజారావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

# ఆటాడుకుందాం రా..!





- క్రీడాశిక్షణలతో కళకళలాడుతున్న మైదానాలు
- జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో ఉచిత శిబిరాలు
- ఒక్కో శిబిరానికి రూ.7వేలు చొప్పన నిధుల కేటాయింపు



డీఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో చిన్నారుల సందడి

విజయనగరం: పుస్తకాలతో కుస్తీపట్టి..పరీక్షలు రాసి హాయిగా ఊపిరి పీల్చుకున్న పిల్లలు..విద్యార్థులు ప్రస్తుతం క్రీడామైదానాల్లో సందడి చేస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించే ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో ఈ శిబిరాలు నిర్వహించనుండగా..ఒక్కో శిబిరానికి రూ.7వేలు చొప్పున జిల్లాకు సంబంధించి రూ.3.50 లక్షలు లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు డీఎస్ఏ అధికారులు తెలిపారు. ఫుట్‌బాల్, తైక్వాండో, ఫెన్సింగ్, చెస్, కరాటే, బాక్సింగ్, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్, బాస్కెట్ బాల్, జూడో, నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, స్కేటింగ్, షటిల్‌బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తుండగా..వాటిని నేర్చుకునేందుకు వచ్చే క్రీడాకారులతో క్రీడామైదానాలు కళకళలాడుతున్నాయి. ఆన్‌లైన్ విధానంలో తరగతులు కొనసాగినప్పుడు సెల్‌ఫోన్‌లకు అలవాటుపడిన విద్యార్థులకు..వాటిపై దృష్టి తగ్గించేందుకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడనున్నాయి. వేసవి క్రీడా శిబిరాలను విజయవంతం చేసేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిపుణులైన శిక్షకులను నియమించింది. ఒకే క్రీడాంశంలో శిక్షణ కోసం వందల మంది విద్యార్థులు వచ్చినా..అందరికీ అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో ఆదరణ ఉన్న కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, బాక్సింగ్, తైక్వాండో, బాల్‌బ్యాడ్మింటన్ ఆడేందుకు ఆసక్తి కనబరుస్తుండగా..ఆయా క్రీడాంశాల్లో ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

**తల్లిదండ్రులు ప్రోత్సహించాలి**

ఆటల వల్ల సమయ పాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవాటు అవుతాయి. ఆరోగ్యంగా ఉంటారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారుడిగా రాణించవచ్చు. సమయం వృథా కాకుండా ఇష్టమైన ఆటను నేర్చుకుని పట్టు సాధించే అవకాశం. క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగం పొందే అవకాశం ఉంటుంది. అండర్–14 బాలబాలికలు క్రీడా శిబిరాలు వినియోగించుకోవాలని క్రీడా శాఖ అధికారులు కోరుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచిస్తున్నారు.

**ఆటతో అభ్యసనం**

పిల్లల్లో ఆటలు సమన్వయ, ఆలోచన, సామాజిక అవగాహన, భాషా నైపుణ్యాలతోపాటు సమగ్ర వికాసం పెంపొందిస్తాయి. మైదానంలో ఏ చోట ఏ ఆట ఆడుకోవాలనే దానిపై సొంత నిర్ణయాలు తీసుకోవడం వల్ల స్వేచ్ఛగా వ్యవహరించే తీరు అలవడుతుంది. సహజ స్వభావం తెలుస్తుంది.

**సామాజిక ప్రవర్తన మెరుగు**

ఈ కాలం పిల్లల్లో సామాజిక ప్రవర్తన లోపించడం ప్రధాన సమస్యగా ఉంది. దీన్ని అధిగమించడానికి ఆటలు బాగా తోడ్పతాయి. మైదానంలోకి చాలా మంది పిల్లలు వస్తుంటారు. వారితో క్రమంగా మాట్లాడడం, ఆటలో భాగస్వాములవడంతో స్నేహం పెంచుకుంటారు. ఇతరులతో ఎలా ప్రవర్తించాలో నేర్చుకుంటారు. నలుగురిలో కలిసిపోవడం, బహిరంగ ప్రదేశాల్లో అనుసరించాల్సిన విధానం, సహనంగా మెలగడం, సమస్యలను పరిష్కరించడం, బిడియాన్ని అధిగమించడం, వైవిధ్య వాతావరణానికి అలవాటు పడడం వంటి ప్రత్యేక నైపుణ్యాలు అలవర్చుకుంటారు. భావోద్వేగాల నియంత్రణకు ఆటలు చక్కటి సాధనంగా పనిచేస్తాయి.

**రోజులో 60 నిమిషాలు శారీరక శ్రమ అవసరం**

పిల్లలకు రోజులో 60 నిమిషాల శారీరక శ్రమ అవసరమని నిపుణులు చెబుతున్నారు. క్రీడల వల్ల కండరాలు బలపడతాయి. శ్వాస, రక్త ప్రసరణ పనితీరు, రోగనిరోధక శక్తి మెరుగుపడతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులు దరిచేరవు. చురుకుదనం, వేగం, బలం, సమతౌల్యం మెరుగుపడి చదువులో రాణించడానికి దోహదం చేస్తాయి. ఆట వారిలో ఊహా శక్తిని పెంచుతుంది. క్రీడల్లో గెలవడానికి ఎత్తులు వేయడం తెలుస్తుంది. ప్రకృతిలో విషయాలను పరిశీలిస్తూ ఉండడం వల్ల మనసులో మెదిలే ఆలోచనలతో సృజనాత్మక నైపుణ్యాలు పెంచుకోవచ్చు.

– బి.రాంగోపాల్, సీఈఓ, సెట్విజ్, విజయనగరం